# 'కులవిద్యలో కూడు లేదు'

## శ్రీ అ. నరసింహ శర్మ

పడాల రావనంటె బొబ్బిలియుద్ధంలో పేరుపొందినవాడు. గొల్లలకి బీడునిలపడంకోసం కాటమరాజు తరపున వీళ్ళ పూర్వులు యుద్ధంచేసేరు. ఇదేకాకుండా వీళ్ళపూర్వుల వీరగాధలుచాలాఉన్నాయి. బుజంమీద పూజువేసి చిన్నాడగ్రామాన్నంతనీ గొఱ్ఱెపందెంలో అన్యాయం చేసేరని వెంటతరిమేడు రావన్న మనవడు.

కరువులకి కరిగిన సంసారాన్ని ముప్పై గొఱ్ఱెతో అప్పన్నతండ్రి అప్పన్నకి వప్పచెప్పేడు పూర్వులవీరగాధలు వినడం అప్పన్నకి సరదా, వీరత్వం కృశించినా, జీర్ణించిన అప్పన్నలో నశించలేదు

మునకాలు పడితే ముప్పైమందిని నిలపెడతాడు.

రాత్రి జామున్నరౌతూంది. హస్త బారెడు పొద్దెక్కింది. కుమ్మరి[1] సారె సగంతూలింది.

వెనక్కి మడకమ్మ తగిలించి మునకాలుబుజంమీద వేసుకున్నాడు.కుక్కను తీసుకొని అప్పన్న మందకాపు కెళ్ళేడు. వెళ్ళడంతోటే మందకదిపి సందకాపులనిఇంటికి పంపేడు. ఇంతలో మొత్తం 2తోగవాళ్ళు, కట్టిదాలాయ, పామునరసాయ కూడావచ్చేరు. నరసాయరావడంతోటె

"బూతోరి కాపొచ్చెండా" అని అడిగేడు.

"ఆడికేటి పోనాది. సల్లగ సరసంసేసి నిక్కుతూ నీలుగుతూ ఒత్తాడు" అన్నాడు దాలాయ.

"ఆఁ-అందరూ అనవే. ఎవుడు మానీసెండో మొన్న [3] ఎవకలనివ్వోళ్ళి [4] ఉతకెత్తనేదా? ఇట్టె కనుగిడితెట్టి ఎల్లిపోనావు"అన్నాడు నరసాయ.

"మనమూ ఈడు నేటిసేసినాము? ఈత ముల్లు కాలంగదా; కంచారొస్తైకాపెట్టి నువ్వుకూడా కునుకెట్టు"అన్నాడు అప్పుడు.

"మన కాలానికి ఈళ్ళకీ సాటేటి? సీపురుపిల్లికాడమందాచి సీతానగరమత్తోరింటికెల్లి సుక్కదూరీ సరికి మందకాడ్డేఉండేవోణ్ణి. అప్పుడేటి, గొఱ్ఱెలు చేలుమేత్తాయని భయమా? జాగిలాలు నక్కలరానిచ్చీవా? ఇప్పుడీ శలక్కాయ పుట్టి ఎక్కడలేని చెలకలూ వరకట్టి పసువు లుసురోసుకుతిన్న. ఎన్ని సేసినా ఆబరికెడే. పొలానికి మందనేదు. పశుకి మేతనేదు. ఈళ్ళకేటి పాడా? పంటా? సామాన్నెమేటి గొల్లుసురూ గొడ్డుసురూ" అన్నాడు నరసాయ.

1 విశాఖ నక్షత్రం.

2 తోగ = గొఱ్ఱెలమంద.

3 ఎవకల = వేసవయూము. 4 ఉతక = తలుపు తిరుగుటకైనకొయ్య (ఉత్తరాశికొయ్య) కుదుపు అనికూడ అర్ధము.

"మేపుల్లేక కాయిలా [1] పడి మందలన్నీ మణిగిపోనాయి! ఎక్కొచ్చే మందలు పోనాయిగదా! ఇప్పుడు ముగ్గురతోగలూ కలిసినా ఆమందకి సాటినేదు. ఏటేటా పిల్లలు కరుసుకి అమ్మడమే గదా?" అన్నాడు అప్పడు.

"ఔనుగాని జాఁబోతు నమ్మేసినా వేంది" అన్నాడు లచ్చాయి.

"ఇల్లు నేతకొచ్చింది. పొలంలో చెఱుకుబోరు ముడ స్తన్నాను కరణం అడ్డం గిరగబడిపోయెండు. శా! మొగ మేన సూసెండుకాడు. మన సిన విసలాడి సంత కెల్లి పది పోగులురెల్లు, పది కబ్బులుకొని ఇల్లు నిలేశన్ను. ఈళ్ళకేటి గుండె తెగుబుట్టుందో మందాపులు మానీసెన్రుగదా! ఏటో ఎరువు బస్తాలంట. బండెడు పెంటకి బస్తా బుగ్గి సాలుతాదా? కంట్రోలొచ్చిందని బత్తెలెగేశంన్రుగదా? కంట్రోలొస్తే కడుపెటుపోద్ది? తెగుళ్ళొచ్చి మందలు మాసిపోతన్నాయి. చినుకు పడితే అడి గెట్టడానిక్కి [2] అంజడు నేల లేదు. గొట్టెకీ గొల్లోడికీ ఎక్కడనేని ఇనాసం పట్టుకుంది. మా ఊరకాడు పట్టపోడు గదా? గొట్టె లమ్మేసి ఆడితో కూలికి రమ్మంతండు. ఆడేటి పోలీసోసి.నాగు సెడ్డీ ఏస్తండు. చేప, జెల్లా వొండుకుంతన్నారు. ఆడి తమ్ముడికి ఇసూకలు బడిలో దొరల సదువు సెప్పిస్తండు. ఉన్నూరు ఒదలడమా అని పరకాయిత్తన్నాను. మీ బొట్టె ఎలిపోదామంతాది. మా యమ్మిని ఆళ్ళ చిన్ని తమ్ముడు సదువుతండు ఆడికిమ్మంతంది ఈ పొద్దు సూపు కొచ్చెన్రు" అన్నాడప్పన్న.

"ఏటప్పన్నా! అమ్మికి పట్టపు సంబందమే! పోకిరీలకి దిగమోకు" అన్నాడు దాలాయ.

"దాలాయ మావా? ఈ "ముండ్రాల" బతుకు నాకు నచ్చనే. పరువా మర్యాదా?

సరే గాని, పట్టపోళ్ళతో కరుసెట్ట గలవా? అందకంతన్నాను" అన్నాడు దాలాయ.

"ఎంత కరుసెట్టయినా ఆ సంబందమే సేయమంతంది మీ యమ్మి. అలపింటిలపింటి సంబందాలు మా దాయి నచ్చవు. కన్నోరింటికాడికి కాపురమెత్తియాలని మా సెపుతంది. నాకూ దాని మాతింసె ఆలాగె అనిపిస్తంది" అన్నాడప్పడు.

"అందకేనా మావా మందుకొనుక్కొ అని సెపుతన్నావు" అన్నాడు దాలాయ.

"మా కిద్దరవంతు సేసిఇచ్చి"అన్నాడు నరసాయ.

మాకు [3] ఆసరానేదు. అందకీ గుమ్మిలోనే కూలాలి. దీనికి సాయం గుడ్డెముక్క సూసుకొని బతుకుదామని ఆస.

ఇలా మాటాడుతూ దుక్కిబెద్దలు సదును చేసి మడకమ్మవేసి గట్టుకి తల ఆనించి పడుకున్నారు ముగ్గురూ. పాలి కాపువచ్చి కదుపు కదుపుతూ ఉన్నాడు.

1 కాయిలా = జబ్బు.
2 అంజడు = పాదము తీసివేయునప్పుడు ఆ రెంటికి మధ్యనుండు నంత.
3 ఆసరా = దాపు, పట్టు

తెల్లవారింది. గొత్తెలుగట్టెక్కించేరు. చల్లందులుతిని • గోపులిప్పి పాలు తీసేరు. తాపుల గొడ్డుకితలకాలరు తగిల్చేరు.

పాలచట్టి పట్టుకొని "పంచాంగ బూతకాడికెళ్ళి మూర్తం బెట్టించమన్నారు" అన్నాది అప్పుడు పెళ్ళాం లచ్చి.

"బావనెల్లి మూర్తం పెట్టించమననేక పోనావా" అన్నాడు అప్పడు.

"కతికితే అతకదని నీఅడుగుల మీదే ఎలిపోనారు. నీకోసం రోడ్డు పని వాళ్ళతో మాటాడి కూలి కుదిర్చేండట, బేగి రమ్మంతండు"అని చెప్పింది లచ్చి

సరే అని లచ్చాయికి సరసాయమందప్పచెప్పి ఊళ్ళోకెళ్ళేడు. ముహూర్తం వారన్నాడు నిశ్చయించేడు పురోహితుడు. బావకి పెందరాడే చెప్పాలని సాయంకాలం బయల్దేరేడప్పుడు. తలకి వేపనూనె రాసి ఆ చెయ్యి ఒంటికి రాసేడు. ఇల్లు సూపు పెళ్ళిపిలుపు కలిసి వస్తాయని లచ్చి కూడా బయలుదేరింది. నాగుతీగ అడ్డకమ్మి తగిల్చి కోక కట్టింది.

అప్పుడు తలపాగావేసి బయల్దేరేడు. చేతి మునకాల విసురిని కాలందుకుంటూంది. వెనకాల లచ్చి కుక్కపరుగుతో నడుస్తూంది. పట్నంవెళ్ళి, బావగారింటిలో దూరేరు. వీది గుమ్మం రెక్కతలుపులు దానిమీదంటించిన సినీమా తారల బొమ్మలు చూచి అప్పన్నకి మనస్సులో తన యింటి ఉతక తలుపు, పెరటి తడక జ్ఞాపకమొచ్చింది.

లోపల మంచం కనిపించింది. మనుషుల నడకలు మాటలు అంతా పూర్వం చూసినవైనా వింతగా కనిపించేయి. ఆటనుండివచ్చిన చిన్నబావ నమస్కరిస్తూ పలకరించేడు.ఉప్పొంగిన మనస్సుకి తిడుతూన్న కరణం జ్ఞాపకమొచ్చేడు. "పల్లెటూరు బతుకేటి బావా! నాను యిక్కడే ఉంతాను మరా వూరెల్లను" అన్నాడు అప్పడు.

"నాతో నాలుగునాళ్ళు కూలికి రా. తరవాత నీకే తెలుస్తుంది మజా" అన్నాడు అప్పడి బావ.

అప్పడు అలాగే చేసేడు. రోజుకి రెండురూపాయిలు కూడా గిట్టడం జరిగింది.

"కులవిద్యకంటె కూలిమేలు బావా" అని పట్నవాసం స్థిరపడింది అప్పడికి. గొత్తెల తాసీల్దారు గొత్తెల నమ్మమని నిర్బంధించినా అమ్మలేదు అప్పడు.

---

• గోపులు. గొత్తెల సిరాలకు కట్టుగుడ్డలు.